క్లుప్తంగా

తాగునీటి బోరు ప్రారంభం

నక్కపల్లి : మండలంలో ఉపమాక గ్రామంలో దుర్గాదేవి ఆలయం వద్ద శనివారం రూ.1.2 లక్షలతో మంచినీటి బోరును తవ్వించి దానికి బోరు హెడ్ బిగించారు. వేసవిదృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన చోట అదనపు బోర్ల ఏర్పాటుకు ఎంపీటీసీలకు చెందిన నిధులు కేటాయించడం జరుగుతుందని ఎంపీటీసీ కొల్నాటి పార్వతిబుజ్జి తెలిపారు.

22న మండల సర్వసభ్య సమావేశం

మునగపాక : మునగపాక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 22న జరుగుతుందని ఎంపీడీవో ఎం.మన్మథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అధ్యక్షతన జరిగే సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాంబిల్లి : విద్యుత్ లైన్ మరమ్మతు పనుల కారణంగా ఆదివారం అచ్యుతాపురం సబ్ డివిజన్ పరిధిలో గల వ్యవసాయ కనెక్షన్లు, ఇండస్ట్రీస్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు అనకాపల్లి ట్రాన్స్‌కో ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 220 కేవీ బ్రాండిక్స్ హైటెన్షన్ విద్యుత్ లైను మరమ్మతు పనులు చేపడుతున్నామన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రెండో రోజు హోమాలు

అచ్యుతాపురం : మండలంలోని హరిగిరిపై వెలసిన విజయదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శనివారం అమ్మవారిని హరిపాలెంలో ఊరేగించారు. ఆలయం వద్ద హోమాలు నిర్వహించారు. కొండపై అమ్మవారి ఆలయం విద్యుత్ కాంతులతో ధగధగలాడుతోంది. ఈ అమ్మవారి ఆలయ నిర్మాణంతో హరిగిరి కొత్త శోభను సంతరించుకుంది.

వైఎస్సార్‌సీపీలో సామాన్య కార్తకర్తలకు గుర్తింపు


చోడిపల్లి గోవిందు

ఎస్.రాయవరం : వైఎస్సార్‌సీపీలో నిజాయితీగా కష్టపడ్డవారికి వారికి తెలియకుండానే గుర్తింపునిచ్చే ఏర్పాట్లు సీఎం జగన్ మోహన్‌రెడ్డి తీసుకుంటున్నారని రేవుపోలవరం సర్పంచ్ అనూరాధ అన్నారు. గ్రామంలో సాధారణ కార్యకర్తగా ఉన్న చోడిపల్లి గోవిందుకు పార్టీ నుంచి పంచాయరాజ్ విభాగంలో ప్రధానకార్యదర్శిగా చోడిపల్లి గోవిందు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పార్టీలో నిస్వార్థంగా సేవలందించేవారికి పెద్దపీట వేస్తూ నిర్ణయాలు తీసుకోవడం అభినందనీయమన్నారు.

జల సంఘాలు సమర్థవంతంగా పనిచేయాలి


మాట్లాడుతున్న గ్రామీణ నీటి సరఫరా విభాగం జిల్లా సమన్వయకర్త పుల్లయ్య

కశింకోట: స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన జల సంఘాలు తమ బాధ్యతలు, నిర్వహణ గురించి సమగ్ర అవగాహన కలిగి ఉండాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం జిల్లా సమన్వయకర్త పుల్లయ్య కోరారు. కశింకోటలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో జల సంఘాల నిర్వహణ, బాధ్యతలపై శనివారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల గ్రామాల్లో జల జీవన్ మిషన్ కింద ఉచితంగా ఇస్తున్న ఇంటింటి కుళాయి కనెక్షన్ల నుంచి అందించే తాగునీటి సరఫరా నిర్వహణ బాధ్యతలను పంచాయతీల నుంచి ఇకపై జల సంఘాలకు అప్పగిస్తున్నట్టు తెలిపారు. దీనివల్ల పారదర్శకంగా నీటిని సరఫరా చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. జల సంఘంలో 11 మంది సభ్యులు ఉంటారని, వీరిలో 9 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఇంజినీరింగ్ సహాయకుడు ఉంటారన్నారు. వారితో బ్యాంకు ఖాతా తెరచి సంఘానికి వచ్చిన నిధుల లావాదేవీలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. మండలంలో ఇప్పటికే 16 జల సంఘాలను స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో అధికారులతో కలిపి ఏర్పాటు చేశామన్నారు.

మేజర్ శారద నదిపై తాత్కాలిక కల్వర్టు నిర్మాణం


రజాల వద్ద మేజర్ శారద నదిపై నిర్మించిన కల్వర్టు మార్గం


రాకపోకలు సాగించేందుకు కంకరతో నిర్మించిన రహదారి

రాంబిల్లి : రజాల వద్ద మేజర్ శారద నదిపై తాత్కాలిక కల్వర్టును నిర్మించారు. సుమారు 750 మీటర్ల పొడవునా కంకరతో రాకపోకలు సాగించేందుకు అనువైన రోడ్డును నిర్మించారు. ఇక్కడ వంతెన లేకపోవడంతో పెదకలవలాపల్లి, వై.లోవ గ్రామాల రైతులు ఏటా ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామాల రైతులకు చెందిన పంట భూములు నదికి ఆవల వైపున ఉన్నాయి. దీంతో పంట ఉత్పత్తులు తీసుకు వచ్చేందుకు అలాగే సాగు పనులు కోసం పొలాలకు వెళ్లేటపుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో ఇక్కడ వంతెన నిర్మించాలని ఈ గ్రామాల ప్రజలు సుదీర్ఘకాలంగా కోరుతున్నారు. ఇక్కడ వంతెన నిర్మాణం లేకపోవడంతో ఏటా ఇక్కడ తాత్కాలిక కల్వర్టును నదిపై నిర్మిస్తుంటారు. ఇక్కడ వేసవిలోనూ నదిలో నీరు ప్రవహిస్తుంటుంది. సముద్ర ప్రాంతానికి చేరువలో ఉండడంతో పాటు పోటు సమయాల్లో సముద్రం నీరు రజాల వరకు శారద నదిలో ప్రవహిస్తుంటుంది. దీంతో నాలుగైదు నెలలకు ఇబ్బందులు లేకుండా ఇక్కడ తాత్కాలిక పనులు చేస్తుంటారు. ఇక్కడ ఈ నిర్మాణంతో కేవలం రెండు గ్రామాల ప్రజలకే గాక దిమిలి, రజాల, కుమ్మరావల్లి, మురకాడ, మర్రిపాలెం, రాజారాయుడుపాలెం తదితర గ్రామాల ప్రజలకు ఉపయోగపడుతుంది. నియోజకవర్గ కేంద్రం యలమంచిలికి మండల కేంద్రం రాంబిల్లి మధ్య సగం దూరం తగ్గడంతో రాంబిల్లి వెళ్లేవారు, అలాగే రాంబిల్లి నుంచి యలమంచిలి వెళ్లే వారు ఈ కల్వర్టు పై నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. సుమారు రూ. 4లక్షల మండల పరిషత్ నిధులతో నిర్మాణాలను చేసినట్టు ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు తెలిపారు. అయితే ఈసారి పటిష్టంగా నిర్మాణం చేపట్టి కంకరతో రోడ్డును నిర్మించామన్నారు. ఈ నిర్మాణంతో పలు గ్రామాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఇక్కడ నదిపై కల్వర్టు నిర్మించకపోతే పండించిన ధాన్యం, పెసర, మినుము ఉత్పత్తులతో పాటు పశు పోషణకు వినియోగించే వరి గడ్డిని ఇళ్లకు తీసుకు రావడం కష్టతరమన్నారు.

భూసర్వేలో తప్పిదాలు సరిచేయాలి

- గ్రామాల్లో అభివృద్ధి పనుల్లో జాప్యం
- మండల సమావేశంలో అధికారులపై సభ్యుల ఆగ్రహం


మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బోదెపు గోవింద్


సమావేశంలో సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

యలమంచిలి : రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. యలమంచిలి మండల సర్వసభ్య సాధారణ సమావేశం ఎంపీపీ బోదెపు గోవింద్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా గత సమావేశంలో సభ్యులు అడిగిన సమస్యలు ఎన్ని పరిష్కరించారో మండల పరిపాలనాధికారి దేవీప్రసాద్ సభ్యులకు వివరించారు. గత సమావేశాల్లో సభ్యులు ప్రస్తావించిన సమస్యలు కొన్ని ఆయా శాఖల అధికారులకు తెలియపరిచి పరిష్కరించేందుకు కృషి చేయడం జరుగుతుందని ఎంపీడీవో అప్పలనాయుడు తెలిపారు. ఇటీవల మృతి చెందిన ఏటికొప్పాక గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యురాలు నగిరెడ్డి దేముడమ్మకు సభ్యులంతా నివాళులర్పించారు. అనంతరం పలువురు సభ్యులు సమస్యలు ప్రస్తావించారు. వైస్ ఎంపీపీ రాజాన శేషు మాట్లాడుతూ పురుషోత్తపురం గ్రామం వద్ద వైశాఖ బయో మెరైన్ పరిశ్రమ వారు పంట కాలువను కప్పేయడం వల్ల నీటి ప్రవాహం ఆగిపోయి పంటలకు సాగు నీరు అందడం లేదని తెలిపారు. మిచౌంగ్ తుపాన్‌లో వచ్చిన వరద కారణంగా కాలువలో నీరు పంట పొలాల్లోకి రావడం వల్ల వేల ఎకరాలలో వరి పంట నీట మునిగిపోయిందన్నారు. గతంలో జరిగిన నాలుగు సమావేశాల్లో ఆ పరిశ్రమ వారికి బాక్స్ కల్వర్టు నిర్మించడానికి నీటి పారుదలశాఖ అధికారులు అనుమతులు మంజూరు చేశారని, అయితే 9 నెలలు గడిచినా అక్కడ ఎటువంటి బాక్స్ కల్వర్టు నిర్మించకపోవడంతో రైతులు నష్టపోయారన్నారు. పంట కాలువలో నీటి ప్రవాహం ఆపి వారి పరిశ్రమకు పైపులు ఏర్పాటు చేసుకుని వెళుతున్నారని, బాక్స్ కల్వర్టు నిర్మించడంలో జాప్యం ఎందుకు జరుగుతుందని సంబంధిత శాఖ అధికారులను ప్రశ్నించారు. సంబంధిత అధికారి మాట్లాడుతూ పరిశ్రమ యాజమాన్యం కల్వర్టు నిర్మాణానికి ప్లాన్ మార్చుకున్నారని ప్రస్తుతం అక్కడ కల్వర్టు నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయని బదులిచ్చారు. మండలంలో ఏటికొప్పాక, కృష్ణాపురం, రుక్మిణీపురం, పులపర్తి, పురుషోత్తపురం తదితర గ్రామాల్లో జగనన్న శాశ్వత భూ హక్కు రీసర్వేలో అధికారుల కారణంగా పలు తప్పులు దొర్లుతున్నాయని పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. రైతుల పేరు మీద సంబంధం లేని వ్యక్తుల పేర్లు రికార్డులు, పాస్ పుస్తకాల్లో నమోదవుతున్నాయన్నారు. గ్రామ సచివాలయ సర్వేయర్లు సక్రమంగా పనిచేయడం లేదని, కొన్ని గ్రామ సచివాలయాలకు సర్వేయర్లే లేరని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ సర్వే కార్యక్రమానికి అధికారుల తీరు వల్ల చెడ్డ పేరు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో కొన్ని చోట్ల జరిగిన తప్పిదాలను ఉన్నతాధికారులు గుర్తించి సరిచేయాలని డిప్యూటీ తహసీల్దారు వీరభద్రాచారిని కోరారు. గూండ్రుబిల్లి గ్రామ సర్పంచ్ నంబారు అప్పారావు మాట్లాడుతూ గ్రామంలో డ్రెయినేజీలు, గ్రామ పంచాయతీ భవనం, శ్మశానవాటికకు ప్రహరీ గోడ వంటి సదుపాయాలకు నిధులు కేటాయించాలని ఎంపీపీని కోరారు. రేగుపాలెం గ్రామంలో హిందూ శ్మశాన వాటిక, ముస్లింల శ్మశాన వాటిక ఆక్రమణలకు గురవుతున్నాయని అధికారులు సర్వే చేసి ఆక్రమణల గుర్తించి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని ఆ గ్రామ సర్పంచ్ కోరారు. ఎంపీడీవో అప్పలనాయుడు మాట్లాడుతూ పేట బయ్యవరం, పురుషోత్తపురం కొన్ని గ్రామాల్లో కొంత మంది పేదల ఇళ్ల పట్టాలకు సాంకేతిక కారణంతో రిజిస్ట్రేషన్ జరగలేదని, సమస్య త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో యలమంచిలి జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి, యలమంచిలి మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర, వైస్ ఎంపీపీ శిలపరెట్టి ఉమ, మండల పరిపాలనాధికారి దేవిప్రసాద్, పాల్గొన్నారు.

లాభసాటి వ్యవసాయం లక్ష్యంగా పనిచేయాలి


సలహా సంఘ సమావేశంలో శాస్త్రవేత్తలు

రాంబిల్లి : లాభసాటి వ్యవసాయం లక్ష్యంగా శాస్త్రవేత్తలు శక్తివంచన లేకుండా పనిచేయాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సహాయ సంచాలకుడు డాక్టర్ ముకుందరావు అన్నారు. హరిపురం బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) లో శనివారం బీసీటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రావు అధ్యక్షతన శాస్త్రీయ సలహా సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముకుందరావు మాట్లాడుతూ, క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందజేయాలన్నారు. గ్రామస్థాయిలోనే నూతన రకాల విత్తనోత్పత్తి పెంచడం ద్వారా వ్యవసాయం లాభసాటిగా మారుతుందన్నారు. జీవ నియంత్రణ, సేంద్రియ విధానాలు ప్రోత్సహించాలని , గ్రామీణ యువతను లాభసాటి వ్యవసాయం వైపు మళ్లించేలా ప్రణాళికలను సిద్ధం చేయాలని తీర్మానించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సంచాలకులు డాక్టర్ పివికె జగన్నాథరావు మాట్లాడుతూ, యాంత్రీకరణను ప్రోత్సహించడం ద్వారా కూలీల కొరతను అధిగమించవచ్చునన్నారు. కేవీకే ద్వారా గత సంవత్సరం పాటు చేపట్టిన కార్యక్రమాలను రాబోయే సంవత్సరంకు సంబంధించి చేపట్టబోయే కార్యక్రమాలను కేవీకే హెడ్ డాక్టర్ శైలజ, శాస్త్రవేత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి పరిశోధన స్థానం సహ సంచాలకులు సురేష్‌కుమార్, విస్తరణ శాస్త్రవేత్త మోహన్, నువ్వుల పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ కుమారితో పాటు పలువురు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

మునగపాక ఎస్ఐకు ప్రశంసాపత్రం



జిల్లా ఎస్పీ మురళీకృష్ణ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్ఐ ప్రసాదరావు

మునగపాక : మునగపాక ఎస్ఐ పి.ప్రసాదరావు శనివారం అనకాపల్లి జిల్లా ఎస్పీ మురళీకృష్ణ చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తున్న ప్రసాదరావు సేవలను గుర్తించి అనకాపల్లిలో జరిగిన క్రైమ్ మీటింగ్‌లో అభినందించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ అందరి సహకారంతో మునగపాక మండల ప్రజలకు మెరుగైన సేవలందిస్తానన్నారు.

ఫ్లై ఓవర్ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే


కొక్కిరాపల్లి ఫ్లై ఓవర్ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

యలమంచిలి రూరల్ : కొక్కిరాపల్లి రైల్వే గేటు వద్ద నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్న ఫ్లై ఓవర్ పనులను ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) శనివారం సాయంత్రం పరిశీలించారు. ఈ నెల 22న రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజాతో వంతెన ప్రారంభోత్సవం చేయించడానికి సన్నాహాలు చేస్తున్నట్టు ఎమ్మెల్యే అధికారులకు తెలిపారు. డిఈఈ, ఏఈఈలు కాంట్రాక్టు పనులు చేపడుతున్న సంస్థ పర్యవేక్షకులతో ఎమ్మెల్యే పనుల పురోగతి, మిగుల పనుల పూర్తికి ఎంత సమయం పడుతుందన్న విషయాలపై ఆరా తీశారు. వంతెన వినియోగంలోకి వచ్చి ఇక్కడి ప్రజల కష్టాలు తీరితే తనకు సంతృప్తిగా ఉంటుందని ఎమ్మెల్యే ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ఎంపీపీ బోదెపు గోవింద్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు ఎర్రయ్యదొర, కొల్లి త్రినాథ్, పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

ఎన్టీఆర్ క్రీడామైదానంలో రూ.50 లక్షలతో కొత్త జిమ్

అనకాపల్లి : ఎన్టీఆర్ క్రీడామైదానంలో జిమ్ నిర్మాణానికి జీవీఎంసీ నిధులు రూ.50 లక్షలు విడుదలయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సుమారుగా రూ.14లక్షల వ్యయంతో స్టేడియంలో గ్యాలరీలు, తాగునీటి సౌకర్యం, మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. నిత్యం వేలాదిమంది మైదానంలో ఉదయం, సాయంత్రం సమయంలో వాకింగ్ చేస్తున్నారని, ఇటీవల కాలంలో ప్రధాన కమిషనర్ సాయికాంత్ వర్మ, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి సహకారంలో దశల వారిగా క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. మైదానానికి వచ్చే ప్రజలకు వ్యాయామం చేసుకునేందుకు జిమ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

రూ.38 లక్షలతో ఎల్లయ్య కాలువపై బ్రిడ్జి పనులు


బ్రిడ్జి నిర్మాణపనులు చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

అనకాపల్లి : స్థానిక వేల్పులవీధి సీతారామ కల్యాణమండపం ఎల్లయ్యకాలువపై జీవీఎంసీ రూ.38లక్షల నిధులతో కొత్త బ్రిడ్జి నిర్మాణానికి పనులు ప్రారంభించడం జరిగిందని 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మీ చెప్పారు. శనివారం బ్రిడ్జి నిర్మాణపనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వార్డులో ప్రజలకు మౌలికసదుపాయాలు కల్పించడంతో పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయలతో రహదారులు, డ్రైనేజీలు, వాటర్ ట్యాంక్‌లు, తాగునీటి కుళాయిలు, ప్రధాన జంక్షన్లు వద్ద విద్యుత్ రింగ్‌పోల్స్ నిర్మించడం జరిగిందన్నారు. వేల్పులవీధి జంక్షన్ వద్ద బ్రిడ్జి శిధిలావ్యవస్థకు చేరుకోవడంతో అటుగా ప్రయాణించే వాహనదారులు, స్థానిక ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని, వివిధ ప్రాంతాల ప్రజలు కల్యాణమండపంలో వివాహాలు చేసుకునే సమయంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడేదని ఆమె తెలిపారు. రూ.38 లక్షలతో బ్రిడ్జిని భారీ వాహనం వెళ్లే విధంగా వెడల్పుచేసి నిర్మించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి జాజుల రమేష్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు-1 ఉగ్గిన అప్పారావు, పార్టీ నేతలు, వేల్పుల గణేష్, మద్దాల రమణబాబు, కొంకి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల నిరసన


ఆర్ఏఆర్ఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

అనకాపల్లి : స్థానిక ఆచార్య ఎన్.జి రంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, కార్మిక చట్టాలు వర్తించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టు వర్కర్స్(సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు గంటా శ్రీరామ్ అన్నారు. ఆర్ఏఆర్ఎస్ కార్యాలయం వద్ద శనివారం కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. కార్మికులు మరణిస్తే సహజ మరణానికి రూ. 2లక్షలు, ప్రమాదశాత్తూ మరణిస్తే రూ.5లక్షలు కుటుంబసభ్యులు నష్టపరిహారం ప్రభుత్వం ఇవ్వాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికులకు లేబర్‌యాక్టులు వర్తించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలో కొణతాల సంతోష్ కుమార్, ఇసరపు లక్ష్మి, మళ్ల లక్ష్మి, నక్కా మంగాదేవి, పల్లా రమాదేవి, వెంకట లక్ష్మి పాల్గొన్నారు.

హత్య కేసు విచారణలో జాప్యంపై ఫిర్యాదు


ఎస్ఐ ప్రసాదరావుకు ఫిర్యాదు చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

మునగపాక : తన భర్త హత్యకు కారకులైన దోషులను శిక్షించాలని కోరుతూ భార్య యల్లపు శిరీషా శనివారం మునగపాక ఎస్ఐ ప్రసాదరావుకు ఫిర్యాదు చేశారు. 2022 అక్టోబర్ 12న తన భర్త యల్లపు మహాలక్ష్మినాయుడు హత్యకు గురయ్యారన్నారు. నాటి నుంచి పోలీసులు విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. అలాగే పోస్టుమార్టం సమయంలో మహాలక్ష్మినాయుడుకు సంబంధించిన వస్తువులను తీసుకొని ఇంతవరకు అందజేయలేదన్నారు. అన్ని ఆధారాలు ఉన్నా పోలీసులు దోషులపై చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి తన భర్త మహాలక్ష్మినాయుడు హత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుని, తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. వినతి అందజేసిన వారిలో యల్లపు భాస్కరరావు, షేక్ ఇస్మాయిల్, ఎరుకునాయుడు, బొడ్డేడ అప్పలనాయుడు, బాధిత కుటుంబ సభ్యులు ఉన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యం


జిల్లా అనుబంధ విభాగాల్లో నియమితులైన గోవిందు, భార్గవ్

నక్కపల్లి : వచ్చే ఎన్నికల్లో జగనన్నను రెండోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవడం కోసం తమ శక్తి వంచన లేకుండా పనిచేస్తామని వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా నియమితులైన గొర్ల గోవిందరాజు (సీతంపాలెం ఎంపీటీసీ), జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన తళ్ల భార్గవ్ (చందనాడ సర్పంచ్) తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ జగనన్న వల్ల ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే పదవులు పొందిన కొంతమంది అవకాశవాద రాజకీయాలు చేస్తూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వేరొక పార్టీ ప్రలోభాలకు తలొగ్గి జగనన్నకు ద్రోహం చేస్తున్నారన్నారు. అటువంటి వారికి ప్రజలు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. బీసీలంతా జగనన్న వెంటే ఉన్నారని గోవిందు పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు జగనన్న ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. పార్టీని నమ్ముకున్న నాయకులను చట్టసభలకు పంపిస్తోందన్నారు. ఆవిర్భావం నుంచి పార్టీకి కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు లభిస్తోందన్నారు. ఎన్నిపార్టీలు కలసి పోటీ చేసినా, జగనన్న వల్ల లబ్ధి పొందిన నమ్మకద్రోహులు ఎన్ని కుట్రలు పన్నినా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే విజయమన్నారు. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. తమకు జిల్లా పార్టీ అనుబంధ విభాగాల్లో అవకాశం కల్పించిన జగనన్నకు, రీజనల్ ఇన్‌చార్జి వై.వి సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే బాబూరావు, సమన్వయకర్త కంబాల జోగులు, కాపు కార్పోరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుకొంటున్నామన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఇద్దరు ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో

ఎస్.రాయవరం : మండలంలో రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఇరువురు విద్యార్థులు ఎంపిక కావడం పట్ల ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. మండల కేంద్రం ఎస్.రాయవరం బాలికల ఉన్నత పాఠశాల నుంచి వై.జీవిత, గుడివాడ ఉన్నత పాఠశాల నుంచి ఎస్.రాఘవేంద్ర ఎంపికైనట్టు ఆయా పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ఈ విద్యార్థులు అనకాపల్లి ఉడ్‌పేటలో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలో ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. వీరికి జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ మెమెంటోలు అందజేశారు. ఈ మేరకు మండల పీఆర్‌టీయు అధ్యక్షుడు భద్రరావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, కోఆర్డినేటర్ చోడిశెట్టి సత్యనారాయణలు అభినందనలు తెలిపారు.

ఆలయ శంకుస్థాపనకు తరలిరండి


మునగపాకలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు

మునగపాక : మునగపాకలో ఈ నెల 19న నిర్వహించనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ శంకుస్థాపనకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు కోరారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆయన శనివారం ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల నాటి కల త్వరలో నెరవేరుతుందన్నారు. గ్రామస్తులంతా ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. రూ.4 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఆలయానికి ప్రతి ఒక్కరూ విరాళం అందజేయాలన్నారు. అదేరోజు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఘనంగా ముగిసిన రథసప్తమి వేడుకలు


రాజుపాలెం గ్రామంలో మందుగుండు సామగ్రిని వెలిగిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు


బాణసంచా వెలుగులు


వేడుకలు తిలకిస్తున్న భక్తులు

అనకాపల్లి : జీవీఎంసీ విలీనగ్రామమైన రాజుపాలెం సూర్యనారాయణమూర్తి, సుంకరమెట్ట జంక్షన్‌లో సూర్యనారాయణ స్వామి ఆలయాల్లో రథసప్తమి వేడుకలు శుక్రవారం రాత్రి ఘనంగా ముగిసాయి. స్వామివారిని రాత్రి 9 గంటల వరకూ భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన స్టేజ్ ప్రోగ్రాంలు, నేలవేషాలు, బుర్రకథలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. రాజుపాలెం సూర్యనారాయణ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ మందుగుండు సామగ్రిని ఎంపీపీ గొర్లి సూరిబాబు ప్రారంభించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా డీఎస్పీ వి.సుబ్బరాజు ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయాల చైర్మన్లు కొణతాల బాబురావు, కె.ఎం.నాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్యుతాపురం : మండలంలోని 220 కేవీ బ్రాండిక్స్ హై టెన్షన్ టవర్ లైన్ మరమ్మతుల కారణంగా అచ్యుతాపురం సబ్ డివిజన్ పరిధిలోని ఇండస్ట్రియల్, వ్యవసాయ రంగాలకు విద్యుత్ సరఫరా ఈ నెల 18న నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ కె. రాజశేఖర్ తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటున్నందున వినియోగదారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. వినియోగదారులకు సహకరించాలని కోరారు.